www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 17 డిసెంబర్ 2022

కొర్లగుంట రోడ్డు విస్తరణతో ప్రజలకు సౌకర్యం : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ తిరుపతి కొర్లగుంట ప్రధాన రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ సూచనలు జారీ చేస్తూ విస్తరణలో భాగంగా 195 ఇండ్లను తొలగించే పనులు పూర్తి కావడంతో రహదారి విస్తరణకు మార్గం సులువైన విషయాన్ని ప్రస్థావిస్తూ వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. కొంతమందికి టిడిఆర్ బాండ్లను ఇవ్వాల్సి వుండడాన్ని కమిషనర్ ప్రస్థావిస్తూ వెంటనే బాండ్లు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే విస్తరించిన రోడ్డు వైపు అండర్ డ్రైనేజ్ కాలువలు, అండర్ విద్యుత్ లైన్ పనుల నిర్మాణాలు చేపట్టాలన్నారు. అదేవిధంగా భూగర్భ డ్రైనేజి కనెక్షన్లను ఇళ్ళకు వెంటనే ఇచ్చే పనులను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే విస్తరణ రోడ్డుకు అవసరమైన పనులు పూర్తి కావస్తున్నాయని, వీలైనంత త్వరగా మిగిలిన పనులను పూర్తి చేసి మరో రెండు నెలల లోపు పూర్తి చేసేలా అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అనుపమ అంజలితో బాటు కార్పొరేటర్ పుల్లూరు అమరనాధ్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవి కుమారి, డిఈ సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

అందరి కోరిక అదే...!

అన్నమయ్య ఇల్లు పునర్నిర్మించాలి

11.5 లక్షల సంతకాలు సేకరణ

గృహసాధన సమితి భారీ ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే.. హైందవ భక్తుల, అన్నమయ్య అభిమానుల, సమతావాదుల.. యావన్మంది తెలుగు ప్రజల కోరిక ఒక్కటే... తిరుమలలో అన్నమయ్య ఇంటిని, మండపాన్ని టిటిడి పున్ణనిర్మించాలి' అంటూ అన్నమయ్య గృహ సాధన సమితి ఆధ్వర్యంలో అన్నమయ్య కళాక్షేత్రం, జైభారత్, చినుకు కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో భక్తులు భారీగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక కపిలతీర్థం నుంచి అన్నమయ్య కీర్తనలను పాడుకుంటూ అన్నారావు సర్కిల్ మీదుగా తిరుమల తిరుపతి పరిపాలనా భవనం వద్దకు చేరుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అన్నమయ్య ఇంటి సాధన కోసం సేకరించిన 11 లక్షల 50వేల సంతకాలను టిటిడి జెఇఒ వీరబ్రహ్మానికి అందజేశారు. ఈ సందర్భంగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయశంకర స్వామి మాట్లాడుతూ పద కవితా పితామహుడు, తొలి వాగ్గేయకారుడు అన్నమయ్య మండపాన్ని, ఇంటిని తిరుమల కొండపై మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా 2003లో కూల్చేశారని, టిటిడి ఘోరమైన అపచారానికి పాల్పడిందని, కోట్లాదిమంది తెలుగు ప్రజల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఈ

సంతకాల పుస్తకాలను తలపై పెట్టుకుని భారీ ప్రదర్శన

దారుణాన్ని సరిదిద్దాలని అన్నమయ్య గృహ సాధన సమితిగా జూన్ 28న ఏర్పడింది. వర్షాలు, ఎండలు సైతం లెక్కచేయకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో దేవాలయాలను, ఆధ్యాత్మిక క్షేత్రాలను, అంగళ్లు, పాఠశాలలను ఎక్కడ జనం గుమిగూడితే అక్కడకు వెళ్లి అన్నమయ్యకు జరిగిన అన్యాయాన్ని వివరించామన్నారు. ప్రతిఒక్కరూ అన్నమయ్యకు జరిగిన అవమానాన్ని జీర్ణించుకోలేకపోయారు. పది లక్షల సంతకాలను లక్ష్యంగాపెట్టుకన్నాం. అనూహ్యరీతిలో 11 లక్షల 50వేల సంతకాలు పూర్తి చేశాం. ఈ సందర్భంగా సేకరించిన సంతకాల పుస్తకాలను నెత్తిపై పెట్టుకుని టిటిడి అధికారులకు వివరించనున్నామని చెప్పారు. అనంతరం ఆరుగురిని లోనికి పిలిపించి గంటసేపు జెఇఒ చర్చించారు. ఈవో దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అన్నమయ్య గృహ సాధన కమిటి రాష్ట్ర కార్యదర్శి త్రిమూర్తులు, వీరబ్రహ్మేంద్రస్వామి మునిమనవళ్లు వీరభట్లయ్య, కోవిదా సహోదయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అనూహ్యరెడ్డి, చినుకు కల్చర్ సొసైటీ వ్యవస్థాపకులు పివిన్ మూర్తి పాల్గొన్నారు.

మృత్యుపాశాలుగా చెరువులు

మట్టి అక్రమ తరలింపుతో చెరువులు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. ప్రకృతి సహజ సంపద కొల్లగొట్టడంతో ప్రజలు ప్రకృతి వైపరీత్యాలకు గురవుతున్నారు. ఆహ్లాదకరమైన గ్రామీణ ప్రాంతాల్లో నిండుకుండల్లా ఉండే చెరువులను చూసి ముగ్ధ మనోహరంగా ఆహ్లాదించాల్సిన ప్రజలు నేడు భయభ్రాంతులకు గురికావాల్సి వస్తోంది. కొంతమంది స్వార్ధ లావాదేవీల కోసం అక్రమ మట్టి తరలింపుకు పాల్పడుతున్నారు. పచ్చని పొలాలకు నీరు అందించే చెరువులను కొల్లగొట్టి ఎటువంటి అనుమతులు లేకుండా పరిమితికి మించి ఇటుక బట్టీలకు, కర్మాగారాలకు మట్టిని తరలించడంతో లోతైన గుంతలు మృత్యుకూపాలుగా మారుతున్నాయి.

ప్రజాశక్తి - ఓజిలి

గ్రామాల్లో చెరువుల వద్ద బట్టలు ఉతకడం సర్వ సాధారణం.. యువత ఈత కొట్టేందుకూ సరదా చూపుతుంది. చెరువు నిండితే గ్రామంలో మహిళలు మధ్యాహ్నం వేళ పిల్లల్ని వెంట పెట్టుకుని చెరువు వద్దకు వెళ్లి బట్టలు ఉతికి ఆరబెట్టుకుని ఇంటికి వస్తుంటారు. అయితే ఎంతో ఆహ్లాదకరంగా కనిపించే చెరువులు ఇటీవల 'మట్టి మాఫియా' చర్యలతో మృత్యుపాశాలుగా మారుతున్నాయి. సరదాగా ఈతకు వెళ్లిన జనాన్ని, బట్టలు ఉతకడానికి వెళ్లిన మహిళలను పిల్లలతో సహా బలి తీసుకుంటున్నాయి. 'మట్టి మాఫియా' కబ్జాదారులు చెరువుల్లో లోతైన గుంతలు తవ్వి మట్టిని తరలిస్తుండడంతో అవి 'మృత్యు కుహరాలు'గా మారుతున్నాయి. తాజాగా ఓజిలి మండలం కొత్తపేట గ్రామంలో గురువారం విషాదం చోటు చేసుకుంది. కొత్తపేట గిరిజన కాలనీకి చెందిన కొట్లపాటి సునీత (32) గురువారం ఇద్దరు బిడ్డలు వైష్ణవి (9), వరుణ్‌తేజ్ (2)లను వెంట బెట్టుకుని సమీపంలోని చెరువు వద్దకు బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు చెరువులో పడి ముగ్గురూ మృతిచెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. చెరువుల్లో గుంతలే ప్రాణాలు తీస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

ఓజిలి మండలంలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. గత ఏడాది జూలై నెల మండలంలోని రాజుపాలెం చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మతి చెందారు. పిల్లలతో కలిసి చెరువు వద్ద బట్టలు ఉతుక్కుంటున్న సమయంలో లోతైన గుంట కనపడకపోవడంతో ముగ్గురు చిన్న పిల్లలు నీటి గుంటలో పడి మునిగిపోయారు. పిల్లలను రక్షించడానికి ప్రయత్నించిన పెద్దనాన్న తోపాటు నలుగురు మతి చెందారు. ఒకే ఇంట్లో నలుగురు మతి చెందిన సంఘటన అప్పట్లో సోషల్ మీడియాలో ,పత్రికల్లో సంచలనం సష్టించింది. మండల కేంద్రానికి చుట్టం చూపుగా వచ్చిన కుర్రాడు కొత్తచెరువు ప్రాంతంలో మలవిసర్జన కోసం వెళ్లి నీటి గుంటలో పడి మతి చెందాడు. ఇటీవల గ్రద్దగుంట గ్రామంలో తండ్రి కొడుకు చెరువులోకి దిగి మతి చెందిన సంఘటన నెల గడవకముందే గురువారం కొత్తపేట గ్రామంలో గిరిజన కుటుంబానికి చెందిన తల్లితో సహా ఇద్దరు చిన్నపిల్లలు చెరువుల పడి మతి చెందారు. ఈ మతులన్నిటికీ కారణం చెరువుల్లో అధిక మట్టిని తొలగించడంతో ప్రమాదవశాత్తు చెరువుల పడి ప్రజలు మత్యువాత పడుతున్నారు.

ప్రభుత్వ అనుమతులతో చెరువుల్లో

చెరువులో పడి మృతిచెందిన తల్లీపిల్లలు (ఫైల్)

మట్టిని తరలించాలంటే నిబంధనలు ప్రకారం సుమారుగా రెండు లేక మూడు అడుగులు మట్టిని తొలగించాలి. అది కూడా ఒకే ప్రాంతంలో మట్టిని తొలగించకూడదు. కానీ మండలంలో మట్టి మాఫియా పెట్రేగిపోయి వారి ఇష్టానుసారంగా గతంలో మండల పరిధిలోని కాజుమేడు ,మాచవరం , రాజుపాలెం, మానమాల, ముమ్మయిపాళెం ,గ్రద్దగుంట , వివిధ గ్రామాల చెరువుల్లో మట్టిని పరిశ్రమలకు,ఇటుక బట్టీలకు, లే ఓట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో చెరువుల్లో పెద్ద పెద్ద గుంటలు ఏర్పడడంతో మూగ జీవాలతోపాటు ప్రజల కూడా మత్యువాత పడుతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చెరువుల్లో మట్టి తరలింపులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో భారీ అవకతవకలు : సిపిఎం

పజాశక్తి - గూడూరు

ఎంఎల్‌సి ఓట్ల నమోదులో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్ విమర్శించారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో అనేక బోగస్ ఓట్లు చేర్చారన్నారు. వీటిని సరిజేయకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గూడూరు సిపిఎం కార్యాలయంలో పార్టీ సభ్యులు, సానుభూతిపరులతో జనరల్ బాడీ సమావేశం శుక్రవారం జరిగింది. ఎంఎల్‌సి ఓట్ల నమోదులో జరిగిన అవకతవకలను వెలికితీసి కలెక్టర్ దృష్టికి, ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికార పార్టీ ఎక్కువ భాగం సర్టిఫికేట్లు లేకపోయినా

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు మూలం రమేష్

ఓటరుగా నమోదు చేశారన్నారు. ఆత్మకూరులో చదువులేని ఏ అర్హత లేని వ్యక్తిని ఓటరుగా నమోదు చేశారని తెలిపారు. పెద్దల ఎన్నికల్లో అధికార పార్టీ ఓటరు నమోదులోనే ఇంతటి అరాచకంగా వ్యవహరించడాన్ని ఖండించారు. తుపానుతో నష్టపోయిన రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలని, పంట వేసుకునేందుకు ఆర్థిక సాయం ఇవ్వాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ మాండూస్ తుపాను కారణంగా జిల్లావ్యాప్తంగా రైతులకు పంట నష్టం భారీగా జరిగిందన్నారు. సిపిఎం జరిపిన సర్వేలో దాదాపు 500 కోట్ల రూపాయల వరకూ నష్టం జరిగిందన్నారు. చేనేత కార్మికుల మగ్గాలు తడిచిపోయి పనులు జరిగే పరిస్థితి లేదన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు 15వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికీ 25 కేజీల బియ్యం, పప్పులు, నూనె ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు పామంజి మణి, నాయకులు జోగి శివకుమార్, ఆర్.శ్రీనివాసులు, సుబ్బయ్య పాల్గొన్నారు.

కళ్యాణ కట్ట పీస్‌రేట్ బార్బర్లపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుమలలో కళ్యాణకట్టలో పనిచేస్తున్న పీస్ రేట్ బార్బర్లపై విజిలెన్స్ వేధింపులు ఆపాలని సిఐటియు నగర నేత టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. తిరుమలలో వేధింపులకు గురైన పీస్ రేటు బార్బర్లను శుక్రవారం కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం విజిలెన్స్ వేధింపులతో అవమానాలు భరించలేక, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని పీస్ రేట్ కార్మికులు తమకు విన్నవించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నేత టి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కళ్యాణకట్టలో పనిచేసే పీసు రేటు కార్మికులు కోర్టుకు వెళ్లారనే నెపంతో టీటీడీ యాజమాన్యం కక్షపూరితంగా విజిలెన్స్ సిబ్బందితో నిత్యం వేధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దౌర్జన్యంగా విజిలెన్స్ సిబ్బంది కార్మికుల ఐడి కార్డులు లాక్కోవడం, లాకర్లు తెరిచి తనిఖీలు చేయడం, విజిలెన్స్ ఆఫీస్ కు రావాలని బెదిరించడం లాంటి చర్యలకు పాల్పడటం తగదన్నారు. భక్తులకు సేవ చేస్తున్న పీస్ రేట్ కార్మికులకు టీటీడీ ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. మహిళా కార్మికుల పట్ల కూడా అమానుసంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. ప్రశ్నించిన కార్మికులను విధుల నుండి తొలగించే కుట్రలు చేస్తున్నారని, గతంలో కూడా అన్యాయంగా తొలగించారని అన్నారు.

ఫ్లై ఓవర్‌పై కారు దగ్ధం

ప్రజాశక్తి - తిరుచానూరు

తిరుచానూరు సింధు జంక్షన్ కూడలి వద్ద నున్న ఫ్లై ఓవర్ పై ప్రమాదవశాత్తు కారు దగ్ధమైన ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. తిరుపతి లక్ష్మీపురానికి చెందిన రైల్వే కాంట్రాక్టర్ శివకుమార్ సొంత పనుల పై రేణిగుంట నుండి ఏపీ39 జేహెచ్ 6703 నెంబర్ గల హోండా అమేజ్ కారులో ఇంటికి తిరిగి వస్తుండగా స్థానిక సింధు ఫ్లైఓవర్ వద్ద కారులో నుండి ఒక్కసారిగా పొగలు రావడంతో వెంటనే అప్రమత్తమైన ఆయన కారులో నుండి బయటకు దూకేసాడు. దీంతో కారు పూర్తిగా దగ్ధమయ్యింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటన తో ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ అంతరాయం కలిగింది.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : చైర్మన్

పజాశక్తి - తిరుపతి టౌన్

దేశంలో ఎక్కడా లేని విదంగా రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రఘునాధ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు తో కలసి నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమా వేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విదంగా మన రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాల సేవలను గ్రామస్థాయి లోనే అందజేయడంతో రైతులు అన్ని విధాలుగా అభివద్ధి చెందుతున్నారని తెలిపారు. రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ తో పాటుగా సున్నావడ్డి అందిస్తున్నామన్నారు. మూగజీవుల ఆరోగ్యం కోసం మైబైల్ చికిత్స వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇంఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ప్రధానంగా లక్ష ఎకరాల్లో వరి వేశారని, ఇటీవల కురిసిన వర్షాలకు వివిధ రకాల పంటలకు నష్టం జరిగిందని, పంట నష్టం పై నివేదికను తయారు చేయడం జరిగిందన్నారు. ఈ మధ్యనే విత్తనాలు వేసి మాండూస్ తూఫాన్ లో నష్ట పోయిన రైతులకు 80శాతం రాయితీ పై విత్తనాల పంపిణీ కొరకు ప్రతిపాదనలు పంపామన్నారు. రైతులకు అవసరమైన డ్రిప్ పరికరాలను రాయితీపై అందిస్తున్నామన్నారు. రైతు కు ఉన్న వ్యవసాయ భూమి లో కొంత పట్టు సాగు చేసుకున్నట్లైతే ప్రతి నెలా ఆదాయం వస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో వర్ద్ ఆర్గనైషన్ సభ్యులు కె.గంగాధర్ మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు శిక్షణ, మార్కెట్ పై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానశాఖ దశరథ రామరెడ్డి, పశు సంవర్ధక శాఖ వెంకటేశ్వర్లు, పట్టు పరిశ్రమ, మత్స్యశాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్ పాల్గొన్నారు.

ఘనంగా యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ ఆధ్వర్యంలో యునైటెడ్ క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన కార్యక్రమానికి ఆ సంఘం ఏపిబిసి చైర్మన్ డాక్టరు యలమంచిలి ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాస్టర్లకు 5 వేల గౌరవేతనం ఇచ్చి సిఎం జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాలో బరియల్ గ్రౌండ్ (శ్మసాన వాటిక) ఏర్పాటు చేయాలని కోరారు. క్రిస్మస్ వేడుకలను క్రిస్టియన్ సోదరులు ఘనంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం కేక్‌కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో విక్టర్ పాల్, డేవిడ్‌రాజు, సిహెచ్.మోషన్, జగ్జీవన్‌రావు, ఇమ్మాన్యూల్, శాంతి శేఖర్, డేనియల్ కృష్ణదాస్, రాజ్‌కుమార్, జయరాజు, తదితరులు పాల్గొన్నారు

రాత్రి పారిశుధ్య పనులు పరిశీలన

తిరుపతి టౌన్ : ప్రతిరోజూ నగరప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కషి చేయాలని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం ఉదయం వరకు నగరంలో జరిగిన నైట్ స్విపింగ్ పనులను తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. గురువారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ రోడ్డు, ఎంఆర్ పల్లి సర్కిల్, బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్ సర్కిల్, నెహ్రూ నగర్, పాత అలిపిరి రోడ్డు మొదలు ప్రదేశాల్లో జరుగుతున్న నైట్ స్విపింగ్ పనులను పరిశీలించారు. రాత్రులలో జరుగుతున్న నైట్ స్విపింగ్ గురించి శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి అడిగి తెలుసుకున్నారు. .

స్టెత్ పట్టిన చేత్తో కుంచె పట్టిన మేయర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వత్తి..ప్రవత్తి..ఆసక్తి.. ఇలా ఎన్నో రూపాలలో సేవలందిస్తున్న తిరుపతి నగర తొలి మహిళ మేయర్ డాక్టర్ శిరీష కుంచె పట్టి బొమ్మలేసారు. వత్తి రీత్యా వైద్యురాలైన ఆమె రాజకీయ అరంగేట్రంతో మేయర్ గా సేవలందిస్తున్నారు. నగర నిర్మాణం, అభివృద్దిలో తనదైన ముద్రను వేస్తూ ప్రభుత్వ ప్రోత్సాహం ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి సహకారంతో నగర సుందరీకరణకు నగిషీలు చెక్కుతున్నారు. ఆధ్యాత్మిక నగరంలో యాత్రికులను ఆకర్షించే విధంగా ప్రజలకు ప్రశాంతతను కలుగజేసే విధంగా పెయింటింగ్స్ వేయిస్తున్నారు. బ్యూటిఫికేషన్ లో భాగంగా ప్రముఖ మార్గాలలో ఉన్న గోడలకు కుడ్యచిత్రాలు ఏర్పాటు చేసారు. పలు గోడలకు పురాణ ఇతిహాసాలు, అందమైన కళారూపాలతో పెయింటింగ్స్ వేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్ సి రోడ్డులోని అండర్ బ్రిడ్జి గోడలకు వేయిస్తున్న పెయింటింగ్స్ ను ఆమె పరిశీలించారు. కళారూపాలతో చేతులు కలుపుతూ కుంచె చేత పట్టి తుది మెరుగులు దిద్దారు. కళాకారులను ప్రోత్సహించారు.నగర పాలక సంస్థ ఆశయాలను పెయింటర్స్ కు తెలియజేసి అందమైన చిత్రాలను వేయాలని సూచించారు..ప్రజలతో మమేకమై..ప్రజల సేవకై పని చేస్తున్న మేయర్ కుంచె చేతపట్టిన చిత్రం కార్మికులకు ప్రోత్సాహకంగా మారింది.

30 లోపు ఎంఎల్‌సి ఓటర్ల తుది జాబితా :కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పట్టభద్రుల ఉపాధ్యాయ నియోజకవర్గ ముసాయిదా జాబితా ఈసిఐ నిబంధనల మేరకు ఉండాలని కలెక్టర్ కే.వెంకట రమణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్లో జే సి డి కే బాలాజీతో కలిసి శుక్రవారం జరిగిన ఎన్నికల వీడియో కాన్ఫరెన్స్ కు కొనసాగింపుగా ఎన్నికల సిబ్బంది, జే సి, జిల్లా విద్యా శాఖాధికారి, ప్రాంతీయ ఇంటర్మీడియట్ విద్యాధికారి వారితో ఏర్పాటు చేయబడిన పర్యవేక్షక కమిటీ ద్వారా పట్టభద్రుల నియోజక వర్గ, ఉపాధ్యాయ నియోజకవర్గ ముసాయిదా జాబితాలో దొర్లిన తప్పులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హత గలిగిన పేర్లను మాత్రమే తుది ఓటరు జాబితాలో ఉండేటట్లు చూడాలన్నారు.

అదేవిధంగా విద్యార్థులకు సంబంధించిన ధవ పత్రాల పరిశీలన నిబంధనల మేరకు ఉండేటట్లు చూసి నిర్దిష్ట సిఫార్సులను ఇవ్వాలని ఆదేశించారు. ఈనెల 30కల్లా ఎంఎల్‌సి తుది జాబితా ప్రచురించాలన్నారు. అలసత్వం వహించరాదన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ శ్రీనివాసరావు డి ఈ ఓ శేఖర్, ఆర్ఐఓ రమేష్ పాల్గొన్నారు.

మల్టీమోడల్ కార్గో టెర్మినల్ ఏర్పాటు చేయాలి : ఎంపి

తిరుపతి టౌన్ : రైలు రవాణా ఆర్థిక వ్యవస్థకు మంచిదని, ఇది అత్యంత ఇంధన సామర్థ్యం ,అత్యంత పొదుపుగా ఉండే రవాణా విధానమని, ఇలాంటి టెర్మినల్స్ ప్రారంభించడం దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని ఎంపి గురుమూర్తి పార్లమెంట్‌లో జీరో అవర్‌లో సభకి వివరించారు. పీఎం గత శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్స్ వివిధ రకాల రవాణా మార్గాలు రైల్వే రవాణా నెట్వర్క్ తో అనుసంధానించబడతాయని తద్వారా సరకు రవాణా ఒక రవాణా విధానం నుండి మరొక విదానానికి తరలించడానికి కనెక్టివిటీ మెరుగై రవాణా సులభతరం అవుతుందని తెలియజేసారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కష్ణపట్నం పోర్ట్, శ్రీ సిటీ , మేనకూరు పారిశ్రామిక వాడలతోపాటు, ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్ -1, 2, బెంగళూరు, చెన్నైకి దగ్గరగా ఉన్న తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం ఈ కార్యక్రమంలో భాగం కావడానికి చాలా అనుకూల వనరులను కలిగి ఉందని తెలిపారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధానమంత్రి గతి శక్తి పథకం కింద గతి శక్తి మల్టీ-మోడల్ కార్గో టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

పిల్లల కోసం కళా ప్రపంచాన్ని సృష్టిస్తూ...

నేటి నుంచి తిరుపతి బాలోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి బాలోత్సవం పిల్లల కోసం పని చేసే సృజనవేదిక. పిల్లల కోసం ఒక కళా ప్రపంచాన్ని సృష్టించాలన్న సత్సంకల్పం. బాలల సర్వతోముఖాభివృద్దే నిజమైన దేశాభివృద్ధి. కలలను కళలుగా మార్చే కమనీయ చైతన్య సిరులు బాలలు. తమస్సునపు చీల్చి ఉషస్సును ప్రసాదించే దీప్తి మన బాలోత్సవం. బాలల నూతన చేతనకు నాంది పలుకుతూ... తిరుపతి బాలోత్సవం పిల్లల పండుగకు ఈ నెల 17, 18న తిరుపతి ఆతిథ్యం ఇవ్వనుంది. ఆరు నెలల క్రితం ఏర్పడిన తిరుపతి బాలోత్సవం జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించింది. 75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లాలో 155 స్కూళ్లలో పిల్లలకు పలు పోటీ కార్యక్రమాలను నిర్వహించింది. పిల్లల్లో విద్య పట్ల ఆసక్తిని పెంచుతూ సాంకేతిక అభివృద్ధిని

బాలోత్సవ ఏర్పాట్లు

పెంచుతూ సమాజం పట్ల పిల్లలకు అవగాహన కల్పిస్తూ శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లేలా బాలోత్సవం కృషి చేయనుంది. రీజనల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నవంబరు 13, 14 తేదీలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించి, 84 పాఠశాలల నుంచి ప్రదర్శనలు నిర్వహించారు. పలు పోటీలలో విజేతలకు నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తిరుపతిలో ప్రప్రథమంగా ఈ నెల 17, 18న తిరుపతి నెహ్రూ మున్సిపాల్ హైస్కూల్‌లో నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో 30 అకడమిక్ 10 సాంస్కృతిక విభాగాల్లో మొత్తం 40 ఈవెంట్లు జరగనున్నాయి. ఇందులో ప్రభుత్వ, నగర పాలిక, టిటిడి, ప్రయివేట్, అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొననున్నారు.

నియమ నిబంధనలు

-అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు.

-పోటీల్లో పాల్గొన్న ప్రతివిద్యార్థికి ప్రత్యేమైన కోడ్ నెంబరు ఇవ్వబడును.

-ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయి. -పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ ఇవ్వబడును.

అనాదిగా ఉంటున్నాం.. ఆదుకోండి..

మంత్రి ఆర్కే రోజాకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు వీఎం మహీన్

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్: తాము అనాధిగా నివాసమున్న ప్రాంతాల్లో తమకు ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి తమను ఆదుకోవాలని గేట్‌పుత్తూరులో రైల్వే స్టేషన్ సమీపం నివశించేవారు మంత్రి ఆర్కేరోజాకు విన్నవించుకున్నారు. రైల్వే అధికారులు స్టేషన్‌కు ప్రహరీ నిర్మించే ప్రక్రియలో భాగంగా వారికి సంబంధిత స్థలాలు సర్వేచేసి నివాసమున్న వారికి ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీచేశారు. రికార్డులున్నవారు తీసుకువస్తే పరిశీలి స్తామని పేర్కొన్నారు. సుమారు 200 మంది ఇలా రైల్వే అధికారులు ఇచ్చిన నోటీసుల కారణంగా ఇబ్బందుల పాలయ్యారు. గురువారం వారు రాష్ట్ర మైనార్టీసెల్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్ ఆధ్వర్యంలో నగరిలోని నివాస కార్యాలయం వద్ద మంత్రి ఆర్కేరోజాను కలిసి తమను ఆదుకోవాలంటూ వినతిపత్రం సమర్పించారు. స్పందించని మంత్రి ఆర్కేరోజా మాట్లాడుతూ ఈ అంశంపై రైల్వేశాఖ మంత్రితోను, రైల్వే జీఎంతోను చర్చించి ఇబ్బందులు పరిష్కరించడానికి తనవంతు కృషిచేస్తానన్నారు.

ఎమ్మెల్యే బియ్యపు పిలుపుతో..

550 మంది రక్తదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఏకంగా 550 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. స్థానిక మధు లాడ్జిలో శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేయడం విశేషం. ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు ముందుకొచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరు ప్రాణదాతలేనంటూ ఎమ్మెల్యే తనయులు బియ్యపు పవిత్రారెడ్డి, ఆకర్ష్ రెడ్డి కొనియాడారు. వయ్యాల కృష్ణారెడ్డి, నందా, గురు దశరథన్, వడ్ల తాంగల్ బాలాజీ, శ్రీవారి సురేష్, కంచి గురవయ్య, నాని, కోవి చంద్రయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా తయారు కావాలి

కమిషనర్ అనుపమ అంజలి

ప్రజాశక్తి - క్యాంపస్ : తప్పులు లేని ప్రత్యేక ఓటర్ల సవరణ ముసాయిదా జాబితా తయారు కావాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. స్థానిక ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం ఈఆర్ఓ, మునిసిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, తిరుపతి అర్బన్ తహశీల్దార్‌లతో కలిసి ఎస్ఎస్ఆర్-2023పై బిఎల్ఓలతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఇందులో బిఎల్ఓలు క్షేత్ర స్థాయిలో నివేదికలు తప్పులు లేని ఓటరు జాబితా ఉండాలన్నారు. ఈపీ నిష్పత్తి, ఫారం 6, 7, 8 క్లైమ్లు పరిష్కారం 20వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఒకే విధమైన ఫోటోలు గల ఎంట్రీలు తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో 20440ను మూడు రోజులలోపు పరిష్కరించాలన్నారు. ఆధార్ అనుసంధానం, ఫారం 6బి లో పురోగతి 60శాతం పైగా సాధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తిరుపతి అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, బిఎల్ ఓ లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అత్యుత్తమ బోధనే లక్ష్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యార్థికి అత్యుత్తమ బోధన అందేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ఎస్సీఈఆర్టీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న సాల్ట్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తరగతి గదిలో జరిగే బోధనను నిశితంగా పరిశీలించి యాప్‌లో అప్లోడ్ చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు నసీం అలీ, సూపర్ పవన్, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

సాయం చేయడమే జీవిత పరమార్థం

మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్

ప్రజాశక్తి-గూడూరు రూరల్: తోటి వారికి సాయం చేయడమే జీవిత పరమార్థమని గూడూరు మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్ అన్నారు. తిరుపతి జిల్లా గూడూరు రెండవ పట్టణ పరిధిలోని విజేత హైస్కూల్లో విజేత స్కూల్ కరస్పాండెంట్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఏ రైటింగ్, డ్రాయింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్ హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సరిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు తక్షణ చర్యలు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: వర్షాలకు తెగుళ్ల బారిన పడిన వరినార్లు, కూరగాయల పంటలను కాపాడుకొనేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఎడిఎ భాస్కరయ్య రైతులకు సూచించారు. ఆత్మపథకం కింద దిగవూరు గ్రామంలో చేపట్టిన పంటలను ఉద్యాన శాఖాధికారి శివకుమారి, వ్యవసాయాదికారి ధనలక్ష్మి సిబ్బందితో కలిసి పరిశీలించి రైతులకు తెగుళ్ల సస్యరక్షణ తదితరాలపై అవగాహన నివారణపై పలు సూచనలిచ్చారు. రైతులతో పాటు దిగవూరు సర్పంచ్ శంకర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయక సిబ్బంది వేణుగోపాల్ రావు, దీపిక, ఉద్యానశాఖ పూర్ణిమ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చింది కాంగ్రెస్సే: చింతా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పంచాయతీరాజ్ చట్టం తీసుకొచ్చి గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. రాహుల్ జోడో యాత్రలో భాగంగా శ్రీకాళహస్తి మండలంలోని జగ్గరాజు పల్లిలో ఇంటింటి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టిన సంస్కరణలను ప్రజలకు వివరించారు. అయితే మోడీ పాలనలో పంచాయతీలు అధికారాలు నిర్వీర్యమయ్యాయని వాపోయారు. ముఖ్యంగా వైసిపి పాలనలో సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి పూర్వ వైభవం రావాలంటే కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని సూచించారు. గురవయ్య, చెంచురామయ్య, సర్పంచ్ బాలమ్మ, పోలి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

మూడు సంవత్సరాలుగా ...
పోలీసుల సమిష్టి కృషి ఫలితం

ప్రజాశక్తి -పిచ్చాటూరు: భార్యను హత్య చేసిన కేసులో సుదీర్ఘకాలం పాటు కోర్టులో జరిగిన కేసులో సాక్షాదారాలతో సహా పక్కాగా నిరూపించి పోలీసులు ముద్దాయికి జైలు శిక్ష పడేలా చేశారు. నగిరి మండలం నత్తకండిగ గ్రామానికి చెందిన లేట్‌మనీ కుమారుడు శరవణ (29). చిత్తూరులోని లక్ష్మీపురం కాలనీలో కాపురం ఉండేవాడు. ఇదే క్రమంలో అక్కడే ఉన్న సత్య (19) పై మనసు పడి పెళ్లి చేసుకున్నాడు. కొంతకాలం వారి వివాహ బంధం సజావుగా సాగింది. తర్వాత వారి కాపురంలో అనుకోని మనస్పర్ధలు పెరిగి అది అనుమానానికి దారితీసింది. రోజూ గొడవ పడేవాడు. ఇదే క్రమంలో కాపురం మారిస్తే బాగున్ను అనే ఉద్దేశంతో పిచ్చాటూరు మండలం వెంగళతూరు గ్రామానికి మకాం మార్చాడు. అక్కడ కూడా వీళ్ళ పరిస్థితి ఇదే విధంగా కొనసాగింది. ఇదే క్రమంలో తరచు వేధింపులకు గురిచేస్తుండేవాడు. 2019 జనవరి 16వ తేదీ ముద్దాయి శరవణ భార్యపై అనుమానంతో గొడవపడి విచక్షణ కోల్పోయి దారుణంగా గొంతు కోసి హత్య చేశాడు. తదుపరి బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాలం పాటు జరిగిన ఈ కేసు విషయంలో కోర్టులో సాక్షాదారాలను నిరూపించడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిర్మల 6త్ ఏ.డి,జే కోర్టు, సీఐ ఎం.సురేష్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ కానిస్టేబుల్లు డి.దేవరాజులు, ఉదయగిరి విశేషంగా కృషి చేశారు. దీని ఫలితంగా ముద్దాయి ఎం.శరవణకు జీవితకాల ఖైది శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా కట్టేలా గౌరవ చిత్తూరు కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేశారు. వారి ఆదేశాల మేరకు ముద్దాయిని డిస్ట్రిక్ జైలులో అప్పగించారు. దీర్ఘకాలిక కేసులను పరిష్కరించడంలో విశేష కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్, సీఐ, కోర్టు కానిస్టేబుల్ వారిని జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి అభినందించారు.

చేనేత కార్మికులను వెంటనే ఆదుకోవాలి

ప్రజాశక్తి-గూడూరు రూరల్ : మాండూస్ తుపాన్‌తో తీవ్రంగా నష్ట పోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గత 15 రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తుండడంతో గూడూరు డివిజన్ లోని, చెన్నూరు, విందురు, వెంకటగిరి, జంగాలపల్లి తదితర గ్రామాలలో మగ్గంగుంటలో నీరు చేరడంతో చేనేత కార్మికుల పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. మగ్గంపైన ఉన్నపడుగు, పేక, నూలు, జరి పూర్తిగా వాన నీటితో తడిసి పనికి రాకుండా పోయాయన్నారు. ప్రభుత్వ వెంటనే స్పందించి ఒక్కో చేనేత కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.20 వేల ఆర్థిక సాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వందవాసి నాగరాజు, గుర్రం రమణయ్య, నారి వెంకటప్పయ్య, నారిసింహులు ఆర్.శ్రీనివాసులు, బాలయ్య పాల్గొన్నారు.

నష్టపోయిన మిరప రైతులను ఆదుకోవాలి

బిఎన్‌కండ్రిగ: మాండూస్ తుపాన్ కారణంగా మిరప పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సత్యవేడు నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే సత్యవేడు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిహేమలత అన్నారు. శుక్ర వారం మండలంలోని కాటూరు, పళ్ళమాల, జంబుగోళం గ్రామాలలో ఆమె పర్యటించారు. గత వారం రోజులుగా బిఎన్‌కండ్రిగ మండలంలో కురిసిన భారీ వర్షానికి సుమారు 1500 ఎకరాలు, రైతులు సాగు చేసిన మిరపపంట పూర్తిగా దెబ్బతిందని, ఆర్థికంగా కోలుకోలేని స్థితిలో ఉన్నారని ఆమె తెలిపారు. మండలంలోని ఆలత్తూరు, పుత్తూరు, జంబుగోళం, పూసరపలి, రోడ్లు గుంతల మయంగా మారాయని, రాకపోకలకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు వెంటనే స్పందించి పై తెలిపినవన్ని వెంటనే సరి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి- దొరవారిసత్రం: గ్రామపంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైసిపి సీనియర్ నాయకులు, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై ఒక్కరోజు శిక్షణ తరగతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరవారిసత్రం మండల పరిధిలోని 22 పంచాయతీలు అభివృద్ధి బాటలో నడిచే విధంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని ఆయన సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు సచివాలయం సిబ్బందికి తెలియజేశారు. ముఖ్యంగా గ్రామాలలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి అపరశుభ్రత లేకుండా పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. గ్రామాలలో అంటురోగాలు రాకుండా సీజన్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు సచివాలయం సిబ్బంది గ్రామీణ ప్రాంతంలో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆ సమస్యలపై ప్రణాళికను తయారుచేసి మండల స్థాయి అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సింగయ్య, ఈవోపీఆర్డి రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేవిబిపురం: గ్రామీణ ప్రజల ముఖ్య అవసరాలను తీర్చే విధంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళి కలను సిద్ధం చేయాలని కెవిబిపురం మండలం ఎంపిపి ముని లక్ష్మీ నందకుమార్ కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా నందకుమార్ మాట్లాడుతూ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక తయారీలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలన్నారు. కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి తదనగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నట్టు ఆయన గుర్తు చేశారు. ఎంపీడీవో రామచంద్రయ్య మాట్లాడుతూ పారిశుధ్య విషయంలో పంచాయతీ సెక్రటరీలు శ్రద్ధ వహించాలన్నారు. తాగునీటి సరఫరా గాను పంపు ఆపరేటర్‌ను ఆయా పంచాయతీలే నియమించు కోవాలన్నారు. పంచాయతీలో ఎక్కడ కూడా తాగునీటి పైపులు లీకేజీ లేకుండా చూడాలన్నారు. వారానికి మూడు రోజులు ప్రతి పంచాయతీ సెక్రెటరీ వారికి సంబంధించిన గ్రామానికి ఉదయం 6 గంటలకే చేరుకుని పారిశుధ్య పనులు చేయించాలన్నారు. సచివాలయాల్లో ఉదయం 10 గంటలకు పంచాయతీ సెక్రటరీలు తప్పక హాజరుకావాలని అప్పుడే మిగిలిన సిబ్బందిపై పట్టు సాధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎంపీటీసీలు సెక్రటరీలు అధికార బృందం తదితరులు పాల్గొన్నారు

కల్లబొల్లి మాటలతో మోసం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బాలాయల్లి : అధికార ప్రభుత్వం కల్లబొళ్లి మాటలతో ప్రజలను మోసం చేస్తుందని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సంగవరం గ్రామ పంచాయతీలోని బస్‌షెల్టర్ వద్ద గల గిరిజనవాడలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాలు మేరకు "ఇదేం కర్మ ..మన రాష్ట్రానికి" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి మాజీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, రామచంద్ర నాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, బూతు కన్వీనర్ గుడి మురళి తదితరులున్నారు.

పుత్తూరుటౌన్: గ్రామాల్లో అధ్వానంగా రోడ్లు డ్రైనేజీ కాలువలు, ఉద్యోగులు జీతాల కోసం ఎదురుచూసే పరిస్థితి, రోడ్డెక్కిన ఉద్యోగులు..అన్ని వర్గాల ప్రజలు ఆవేదన చెందుతున్నారని పుత్తూరు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. మండలంలోని కేబిఆర్ పురం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి -మీ కోసం-మీ తెలుగుదేశం భాగంగా ఇంటింటికీ వెళ్ళి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఎస్ మోహన్ రాజు, మహేష్, వెంకటరమణ, మునికృష్ణ, సుబ్రహ్మణ్యం, బాలాజీ, సురేంద్రబాబు, రామయ్య పాల్గొన్నారు

తిరుచానూరు: స్థానిక తిరుచానూరు గ్రామ పంచాయతీ చైతన్యపురంలో చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని అధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ' మన రాష్ట్రానికి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీసిటీలో 'గతి శక్తి' మార్కెటింగ్ సమావేశం

- రైల్వే, పోస్టల్ శాఖల నూతన వస్తు రవాణా పథకం'జాయింట్ పార్శిల్ ప్రొడక్ట్' పై వివరణ

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: దేశ ఆర్థికవృద్ధికి తోడ్పాటు నందించే ప్రక్రియలో భాగంగా భారత రైల్వే, పోస్టల్ శాఖలు సంయుక్తంగా చేపట్టిన సరికొత్త వస్తు రవాణా పథకం "జాయింట్ పార్సిల్ ప్రొడక్టు"కు సంబంధించిన ప్రత్యేక మార్కెటింగ్ సమావేశం శుక్ర వారం శ్రీసిటీలో జరిగింది. రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (స్ట్రాటజిక్ ప్లానింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్) జి.వి.ఎల్.సత్యకుమార్, పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ జగదీష్ పాయ్‌లతో పాటు రెండు శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొని, జాయింట్ పార్సిల్ ప్రొడక్ట్ (జెపిపి) గురించి పరిశ్రమల ప్రతినిధులకు వివరించారు. రైల్వే, పోస్టల్ శాఖల అధికారులకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, పరిశ్రమల వస్తు రవాణా సేవలను మెరుగుపరచడానికి కొత్త పథకాన్ని ప్రారంభించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా చేకూరే ప్రయోజనాలు గురించి అధికారులతో సమగ్రంగా చర్చించాలని పరిశ్రమల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. శ్రీసిటీలో జెపిపి కార్యకలాపాలను ప్రారంభించేందుకు వీలుగా పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు శ్రీసిటీలో అదనపు కార్యాలయ స్థలాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. శ్రీసిటీ సమీపంలోని తడ రైల్వే స్టేషన్ లో సౌకర్యాలు మెరుగుపరచాలని, పరిశ్రమల ఉద్యోగులకు వీలుగా చెన్నై-శ్రీసిటీ మధ్య రైళ్ల రాకపోకలను పెంచేందుకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశం అనంతరం సత్యకుమార్, ఇతర రైల్వే అధికారులు తడ రైల్వే స్టేషన్ ను సందర్శించి, అక్కడ సౌకర్యాలు చేయాల్సిన అంశాలను పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు

మండల విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: ఇటీవల తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖోపోటీల్లో జిల్లా తరపున పాల్గొని జిల్లా జట్టుకు చిన్న పాండూరు వడ్డిపాలెంకు చెందిన ఆవల రాజేశ్వరి, జయరామయ్య కుమార్తె వరద యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి హిమబిందు ఎంపికైంది. ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైన హిమబిందును గ్రామస్తులు, ప్రధానోపాధ్యాయులు, మోహన్‌బాబు వ్యాయామ ఉపాధ్యాయుడు బందిల కుమార్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపి ప్రశంసించారు.

మృతుల కుటుంబానికి

మాజీమంత్రి పరామర్శ

ప్రజాశక్తి - ఓజిలి : మండలంలోని కొత్తపేట చెరువులో పడి స్థానిక గిరిజన కాలనీకి చెందిన తల్లీ,పిల్లలు మృతి చెందిన సంఘటన తెలిసిందే. విషయం తెలుసుకున్న మాజీమంత్రి పరసారత్నం నీటిలో పడి మృతి చెందిన సునీత, పిల్లలు వైష్ణవి, వరుణ్ తేజ్ మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈయన వెంట చింతల సతీష్ చంద్ర, ముత్యాలయ్య తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): తిరుచానూరులో ఉన్న ఎడిఫై పాఠశాల డైరెక్టర్ ప్రణీత్ తమ విద్యార్థులకు సామాజిక స్పృహను కల్పించాలని, సమాజంపై నేటితరం పిల్లలకు బాధ్యత మరింతగా పెంచాలని శుక్ర వారం మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మంగళం ట్రెండ్స్)లకు కంప్యూటర్, క్రీడా సామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.కేశవుల నాయుడు సమక్షంలో పాఠశాలకు అందించారు. ఉపాధ్యాయులు వసుంధర, శైలజ, వెంకటేశు, మునిరత్నం పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో సాయిరాం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్స్ వాసుగౌడ్, హరినాథ్ రెడ్డి, రాఘవరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, కళ్యాణి పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షిస్తా : తాజుద్దీన్

ప్రజాశక్తి - వెంకటగిరి: వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరి రక్షిస్తానని తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గా ఎన్నికైన పఠాన్ తాజుద్దీన్ తెలిపారు. శుక్ర వారం తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు నూతన కమి టీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఛైర్మన్ సిరాజ్, డైరక్టర్‌గా తాజుద్దీన్ నియమిస్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు డైరక్టర్ తాజుద్దీన్ మాట్లాడుతూ వెంకటగిరిలో జామియా మసీదు ఆస్తులను పరిరక్షిస్తూ వాటి అభివృద్ధి తోడ్పా టును అంది స్తానని తెలియజేశారు. ముస్లిముల సహ కారంతో వెంకటగిరి ముస్లిం సోదరులకు కావా ల్సిన పనులు చేపడుతానని తెలియజేశారు.

ఏకలవ్య మోడల్ స్కూల్‌కు..

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రిన్సిపాల్ దామోదర నాయుడు

ప్రజాశక్తి-బిఎన్‌కండ్రిగ: మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ కి పూర్తి స్థాయి మౌలిక సదు పాయా లు కల్పించాలని ప్రిన్సిపల్ దామోదర్ నాయుడు తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎంపి గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి అర్జున్ ముండాని కలిసి మాట్లాడారు. మంత్రి సానూకూలంగా స్పందించారని త్వరితగతిన చర్యలు తీసుకొంటామని చెప్పారని తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలియజేశారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2 కోట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం 2 కోట్లా 6 లక్షలా 85 వేలా 964 రూపాయలు వచ్చింది. స్థానిక ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు జరిగింది. బంగారం 0.90 గ్రాములు, వెండి 751.900 కిలోలు, 108 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

దుండగులను త్వరలో పట్టుకుంటాం

డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - ఓజిలి : దొంగతనాలకు పాల్ప డుతున్న దుండగులను త్వరలో పట్టుకుంటామని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. మండలంలోని వాకాటివారికండ్రిగ గ్రామంలో గురువారం పాఠశాల, అంగన్వాడి కేంద్రంలోకి హెల్మెట్లు ధరించి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన సంఘటనపై డిఎస్పీ రాజగోపాల్ రెడ్డి బాధితులను సమాచారం అడిగి తెలుసు కున్నారు. దొంగతనాలకు పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామని గ్రామస్తులు భయాందోళన చెంద వద్దని తెలియజేశారు. ఈ దర్యాప్తులో నాయుడుపేట రూరల్ సీఐ వైవి సోమయ్య, ఎస్ఐ దారం ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కారు దొంగతనం కేసులో..

ముద్దాయిలు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): తిరుపతి ఆర్ అండ్ బి అతిధి గృహం వద్ద పార్కింగ్ చేసిన ఇన్నోవా క్రిష్ట వాహనం దొంగతనం కేసులో అలిపిరి పోలీసులు ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం మంగళంలోని అలిపిరి పోలీస్ అవుట్ పోస్టులో సీఐ అబ్బన్న, ఎస్ఐ ఇమ్రాన్ బాషా ఆధ్వర్యంలో కేసు వివరాలను వెల్లడించారు. చిత్తూరు జిల్లా, రొంపిచర్ల మండలం, బండకిందపల్లి గ్రామానికి చెందిన డి.శ్రీనివాసులు వాహనం ఇన్నోవా క్రిష్ట ఎపి03టికె0911 ఈ నెల తిరుపతి కనక భూషణ్ లేఔట్ సమీపంలోని ఆర్ అండ్ బి అతిధి గృహం వద్ద పార్కింగ్ చేసి ఉందన్నారు. కడప జిల్లా కొండాపురం మండలం, రామచంద్ర నగర్‌కు చెందిన పాణ్యం బేనోని బెనర్జీ ప్రస్తుతం తిరుపతి కనక భూషణ్ లే అవుట్ లో నివాసముంటున్న తిరుపతి ఆటోనగర్, కృష్ణారెడ్డి నగర్‌కు చెందిన కషువ జ్ఞానేశ్వర్ నాయుడు అలియాస్ నానితో కలిసి కారును దొంగతనం చేసి రేణిగుంట మార్గంలోని నెక్సా కార్ల షోరూం వద్ద ఖాళీ ప్రదేశంలో దాచి పెట్టారు. శుక్రవారం అలిపిరి సీఐ అబ్బన్న, ఎస్ఐ ఇమ్రాన్ బాషా సిబ్బందితో కలిసి ముద్దాయిలను అదుపులోకి తీసుకొని కారును స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు అంతరాష్ట్ర ముద్దాయిలు అరెస్టు

రూ.1.5 లక్షల విలువగల రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి- పిచ్చాటూరు: తిరుపతి జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం నేర నియంత్రణలో భాగంగా పుత్తూరు డిఎస్‌పి రామరాజు పర్యవేక్షణలో శుక్రవార ఉదయం సుమారు 11 గంటలకు పిచ్చాటూరు మండలం పుత్తూరు ఊతుకోట జాతీయ రహదారిపై రామగిరి బస్ స్టాప్ వద్ద పిచ్చాటూరు ఎస్ఐ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వస్తున్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకుని విచారించారు. వారు అలిపిరి, పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనాలు చేసినట్లు నేర వాంగ్మూలం ఇచ్చారు. వారి మీద ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలలో సుమారు పదికి పైగా దోపిడీ దొంగతనాలు కేసులో ఉన్నట్లు విచారణలో తేలింది. ఏ వన్ రాసపాలెం సలీం భాష (22)పై పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌లో ఎన్ బి డబ్ల్యు నాగలాపురం పోలీస్ స్టేషన్ లో రాబరీ కేసులో అరెస్ట్ పెండింగ్ ఉన్నట్లు తెలిసింది. ముద్దాయిలను శుక్రవారం రిమాండ్ నిమిత్తం రాజశ్రీ జె ఎఫ్ సి ఎం కోర్టు సత్యవేడులో హాజరు పరిచారు.

ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్..

నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పుత్తూరు డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక ఏ డీకే కళ్యాణ మండపంలో సర్వ సభ సమావేశం డిస్కం జనరల్ సెక్రెటరీ టి.జయరామయ్య అధ్యక్షతన పుత్తూరు డివిజన్ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రీజినల్ నాయకులు ఐ.సుబ్రహ్మణ్యం, టీ.జనార్దన్‌రావు, శంకరయ్య, మోహన్ హాజరయ్యారు. ఎంపి ఎంపికల్లో డివిజన్ అడ్వైజర్‌గా ఎస్.చంద్రయ్య, ప్రెసిడెంట్‌గా సి.శంకరయ్య, డివిజనల్ సెక్రటరీగా జై.మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.చంగయ్య, ఆర్గనైజర్ సెక్రటరీగా ఎం.హరిబాబు, పబ్లిసిటీ సెక్రటరీగా టి.సురేష్ బాబు, కోశాధికారిగా ఏపాల్ రాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ శంకరయ్య మాట్లాడుతూ. ఎంప్లాయిస్‌కి ఎలాంటి సమస్యలు ఉన్నా యూనియన్ బూస్ట్‌కి తీసుకొస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

మహిళా విభాగం నూతన కార్యవర్గం..

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఏపీజి ఏ.పుత్తూరు తాలూకా మహిళా విభాగానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మిపతి, జిల్లా అధ్యక్షులు ప్రసాద్, పుత్తూరు తాలూకా అధ్యక్షులు జి.రవికుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా వై.రోజారమణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, కార్యదర్శిగా కె.వాణి, ఏవో ఎంపీడీవో ఆఫీస్ పుత్తూరు కోశాధికారిగా డి.సుగుణ, సీనియర్ అకౌంటెంట్ ట్రెజరీ పుత్తూరు వారు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎస్.శ్రీదేవి వెటర్నరీ సర్జన్ పిఆర్ మంగళం, ఏ.స్వరూప డీపీ తహశీల్దార్ ఆఫీస్ పుత్తూరు, కె.నిర్మల పంచాయతీ కార్యదర్శి పిఆర్ మండలం, ఆర్ లలిత. ఎంపిహెచ్ఎస్ (ఎఫ్)పుత్తూరు వారు, ఉప-కార్యదర్శిగా ఎం.సుభాషిని, స్టాఫ్‌నర్స్ పిహెచ్‌సి నారాయణ వారు, ఎం. జయసుధ సోషల్ వెల్ఫేర్ పుత్తూరు, ఏ.నాగమణి మహిళా పోలీస్ సచివాలయం పుత్తూరు వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శాంతి దుర్గా జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు వ్యవహరించారు. ఈ ఎన్నికలకు కోశాధికారి మధు బాబు, జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్, సుబ్బరాయుడు, పుత్తూరు తాలూకా ఆర్గనైజర్ సెక్రెటరీ రవిచంద్ర పాల్గొన్నారు.

"ర్యాగింగ్ రహిత క్యాంపస్"గా నారాయణ కళాశాల

ప్రజాశక్తి-గూడూరు రూరల్ : పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గూడూరు డీఎస్పీ ఎం. సూర్య నారాయణ రెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్ శుక్రవారం 'యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్' నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు సంబంధించి దేశంలోని చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు, కళాశాల ఆవరణలో ర్యాగింగ్‌ను పూర్తిగా నిషేధించామని ఎవరైనా కాలేజ్/డిపార్ట్‌మెంట్/క్లాస్‌రూమ్/బస్సు/ ప్రైవేట్ హాస్టల్స్, పేయింగ్ గెస్ట్ వసతి గదులు/ అద్దె ఇల్లు లో ఏ రూపంలోనైనా ర్యాగింగ్‌గు పాల్పడితే కఠిన శిక్ష, జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఏదైనా సమస్య తలెత్తితే తమ దృష్టికి తీసుకురండని విద్యార్థులకు తెలిపారు. కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ, క్రమశిక్షణ కమిటీ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జ్ డా.బి.వి.కృష్ణయ్య యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయడం ద్వారా, పర్యవేక్షణ, అప్రమత్తత చురుకుగా జరుగుతున్నాయని, హాస్టళ్లు, సాధారణ స్థలాలు వద్ద తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలియజేసారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రవిప్రసాద్, వైస్-ప్రిన్సిపాల్ కే.విశ్వక్ సేన రెడ్డి, మేనేజింగ్ సెక్రటరీ వై.వినయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగింపు

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: పట్టణంలోని ప్రజల సౌకర్యం కోసమే జెసిబి సహకారంతో కూరగాయల మార్కెట్, తిరుపతి మెయిన్ రోడ్డు లో ముళ్లపొదలను తొలగిస్తున్నామని పురపాలక సంఘ కమిషనర్ కేఎల్ ఎంఎన్ రెడ్డి పేర్కొన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయు పనిని పరిశీలించారు. చిన్నారాజు కుప్పం ప్రధాన రహదారి ప్రక్కన వున్న ప్రధాన కాలువలో అడ్డుగా వున్న ముళ్లపొదలను, మట్టిని జెసిబి వినియోగించి తొలగించారు. పట్టణంలోని అరేటమ్మ గుడి ఎదురుగా వున్న పురాతన ఇంటి గోడ రోడ్డుమీద వెళ్లే పాదాచారులు, వాహన దారులపై పడిపోయేందుకు అవకాశం వుందని భావించి జేసీబీ సాయంతో పాత గోడలను తొలగించి రహదారికి అడ్డుగా వున్న ముళ్ల పొదలను కూడా తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్ ఏ.హరి, మున్సిపల్ ఏఈ సిబ్బంది పాల్గొన్నారు

లింగ సమానత్వ అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయనం కేంద్రం ఆధ్వర్యంలో లింగ సమానత్వ అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ అధ్యయన కేంద్రం అధ్యాపకులు మాట్లాడుతూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సూచన మేరకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు లింగ వివక్షతకు వ్యతిరేకంగాప్రభుత్వ ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని పలు శాఖల అధికారులు, రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పిలుపునిచ్చారన్నారు. ఈ మేరకు స్వచ్ఛందంగా శుక్రవారం లింగ సమానత్వానికి సంబంధించిన నినాదాలతో అవగాహన ర్యాలీ శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుండి వెస్ట్ చర్చి వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా విశ్వ విద్యాలయం విద్యార్థులు, అధ్యయన కేంద్ర విభాగ సిబ్బంది పాల్గొన్నారు.